

# ప్రేమలో కత్తి

**మైత్రేయ**

'అబ్బాయి! నేనింకా యెందుకు బ్రతికున్నా ననుకుంటున్నావ్! శారద మొహంలోకి చూస్తూ, ఆనందరావు యింకా యేదో అనబోతున్నాడు.

'అబ్బాయిగారి పెళ్లి చూడ్డానికేగా! పక పక నవ్వింది శారద. 'నీకూ వంట పట్టిందన్నమాట...రోజుకు యీ ముక్క యెన్నిసార్లన్నా మా అమ్మకు విసుగుపుట్టదు...అసలు ఆమెగారి మనస్తత్వం నాకర్థం కావటం లేదంటే నమ్ము... పోనీ అంత తపన పడుతోందిగా మరి, నిన్ను కోడల్నిగా చేసుకోవటానికి యేమిటింకా ఆలస్యం...'

ఇది బాగానే వుంది... ఇంతవరకు మీ అమ్మగారితో, మనం యెవరైనా పెళ్ళి విషయం చెప్పామా!... సిగ్గును అభినయించింది. శారద.

'నోరువిప్పి అడగాలేమిటి!... అయినా మా అమ్మ చాలా మంచిది. నేను యేది చెపితే అదే వప్పుకుంటుంది...

'అయితే చెప్పకపోవటం లోపం మీదే అన్నమాట...' 'నేనూ సమయంకోసం యెదురు చూస్తున్నా... ఎట్లాచెప్పాలా

అని ఆలోచిస్తున్నా...' ఆనందరావు కొంచెంగా తలవంచుకున్నాడు.

ఇంతలోకి లలితాదేవి వస్తున్న అలి కిడి కనిపెట్టి, శారద గబగబ దొడ్లోంచి దారితీసింది. ఆనందరావు సీరియస్‌గా మొహంపెట్టి, చేతిలో ఓ పుస్తకాన్ని తీసుకుని అతి శ్రద్ధగా చదువుతున్నట్లు నటిస్తున్నాడు. తల్లి లోపలికి వచ్చినా, గమనించనట్టుగానే, పుస్తకంమీద నుంచి దృష్టి మరల్చలేదు.

లలితాదేవి గంభీరమైన వ్యక్తి, తొణ కదు. చాలా తీవ్రంగానూ లోతుగానూ ఆలోచించగలదు ఎలాంటి పరిస్థితుల్లో నైనా నిబ్బరంగా వుండగలదు. మాటల్లో పట్టుపడదు. అమాయకంగా కనిపిం చటం,మాట్లాడటంఆమెలో ఒకప్రత్యేకత. ఇట్టే పసికట్టేసింది. శారద కొంచెం సేపటి క్రిందట యిక్కడకు వచ్చిం దని తెలుసుకుంది. చేమంతిపువ్వు, దొడ్డి గుమ్మందగ్గర పడివుండటం ఆమె చూసింది. దానర్థం ఆమెకు తెలుసు. తానింట్లో లేనప్పుడు అప్పుడప్పుడు శారద రావటం, గమనిస్తూనే వుంది. అయినా అదొక విషయంగా, కొడుకు దగ్గర ప్రస్తావించదు. అయితే యీ మధ్యలో వాళ్లిద్దరి మధ్య పెరుగుతున్న అన్యోన్యత,అనురాగం,లలితాదేవినిబాగా కలవరపెట్టేస్తున్నాయి. ఆనందరావుతో, సూటిగా, తన అభిప్రాయం చెప్పదు. శారదను, తన కోడలుగా చేసుకోవటం సుతరాం యిష్టంలేదు. ఏంచెయ్యాలా అని మథనపడుతోంది.ఒళ్లంతా కంపరం పుట్టుకొచ్చింది. తామసం పెరుగు తోంది. పెద్ద పెట్టున నిట్టూర్పు విడిచి, తమాయించుకుని, మెల్లగా లోపలికివచ్చి కళ్లజోడు అద్దాలను చీరకొంగుతో అద్దు కుంటూ, చిరునవ్వు పెదిమలమీదికి బల వంతంగా తెప్పించుకుని, 'అబ్బాయ్' అంటూ ఆప్యాయంగా పిలిచింది.

ఉలిక్కిపడ్డట్టుగా చప్పున వెనక్కి తిరిగి 'ఎప్పుడొచ్చావ్ అన్నాడు ఆనంద రావు అప్రయత్నంగా.

'ఎప్పుడురావటం యేమిట్రా ! ఏ ఊరు వెళ్లానని...ఏమిటి అట్లా గాభరా పడుతున్నావ్...' మొహం చిట్లిస్తూ అడిగింది.

'అబ్బే యేంలేదే యేముందని...' తడబడ్డాడు.

'నువ్వేదో చదువుతున్నట్టున్నావ్, మధ్యలో నేవచ్చి, నీ చదువుకాస్తా, ఆపేశా...నేవస్తా... ?

'అమ్మా'...అని మెల్లగా అన్నాడు.

'ఏమిటి నాయనా పిలిచావా...' చప్పున వెనక్కి తిరిగింది.

ఆనందరావు మెదలకుండా వూరు కున్నాడు. లలితాదేవి కూడా మ్రుభావం గానే వెళ్లిపోయింది. మెల్లిగా, ఆనంద రావు, తల్లిదగ్గరకు వెళ్లి కూర్చున్నాడు. ఏదో అడుగుదామని ఆదుర్దాపడుతున్నా డేకాని, నోట మాట రావటం లేదు.

తల్లినిచూస్తే భయమూకాదు. తన పెళ్లి విషయం అడగగూడదని కాదు. అయితే మనస్సులో ఆందోళన ఒకటి వుంది. తీరా శారద విషయం చెపితే, ఆమె ఒప్పుకోపోతే, పెద్ద కథలా తయారవుతుంది జీవితం.

అప్పుడు, ఆమెగారిక్కి యిష్టంలేని పెళ్లి చేసుకోవటం కష్టమే. శారదను కాదని, యింకొకతెను పెళ్లిచేసుకోవటమూ అంతకంటే కష్టం. అనుకుంటూ మధనపడుతున్నాడు. శారదను తనతల్లి ఒప్పుకుంటుందో, ఒప్పుకోదో అనే సందేహం ఆనందరావుకు కలగటంలో కారణం లేకపోలేదు. లలితాదేవికి, చిన్ననాటి స్నేహితురాలు కామాక్షమ్మంటే అతి గౌరవమూ, అభిమానము. ఆమెకు ఒక్కర్తే కూతురు, బోలెడు ఆస్తి, ఎట్లాగయినా ఆ పిల్లను తన కోడలినిగా చేసుకోవాలని తన తల్లి ఉబలాటపడుతున్నట్లు, మాటలసందర్భంలో ఆనందరావు గ్రహించాడు. కాని తనతో ఆ మాట ఎన్నడూ అనలేదు. తన తల్లి మనస్సు కష్టపెట్టటం యెంత మాత్రం యిష్టంలేదు. తీరా, తన అభిప్రాయం చెప్పేటప్పటికి, యేరకమైన సమాధానం వస్తుందో అని భయపడుతున్నాడు. అందుకనే నోరువిప్పి అడగటంలేదు. తటపటాయిస్తున్నాడు. మళ్లీ ఆలోచనలో పడ్డాడు. సూటిగా తానుగా యీ విషయం చెప్పకుండా, యింకెవరి చేతయినా, తన అభిప్రాయం, తన తల్లికి తెలియపరచి, ఆమెగారి మనోభావాలు తెలుసుకోవటం మంచిది అనే నిర్ణయానికి వస్తున్నాడు. అందుకనే తల్లిదగ్గరకు వెళ్లినప్పటికీ, యేమీ మాట్లాడకుండానే కూర్చున్నాడు.

'ఏమిటి నాయనా అట్లావున్నావ్' అని కొడుకును చూసి, లలితాదేవి అన్నప్పటికి, 'ఏంలేదు మామూలుగానే వున్నానే' అంటూ సమాధానం చెప్పేశాడు. లలితాదేవి కూడా, చాలా యిరకాటంలో పడిపోతోంది. తన కొడుక్కి, శారద కాకుండా, ఆ 'సరళ' భార్యగా అయితే బాగుండునని గట్టిగా వుంది. ఆ వియషం కొడుక్కి యేవిధంగా చెప్పాలా అని తీవ్రంగా ఆరాట పడుతోంది. ఎట్లాగయినా, తనంతట తాను సూటిగా చెప్పటం యిష్టంలేదు తీరా, అతను తాను చెప్పినమాట యిష్టపడకపోతే తానూ బాధపడుతుంది. అతనూ చాలా వ్యధ పడతాడు. అంతేగాక, రానురానూ పర్యవసానంయెట్లావుంటుందో! లోకంలో యెన్నో వింటున్నాం, యెన్నో చూస్తున్నాం. చాలా జాగ్రత్తగా వ్యవహరించి, విషయం బెడిసిపోకుండా నాజూకుగా, సున్నితంగా, తన అభిప్రాయం కొడుక్కి తెలియపరచి, చివరకు, పని సాధించుకోవాలి అని లలితాదేవి, నిశ్చయానికి వస్తోంది. ఇద్దరూకూడా, తలొక ప్రపంచంలోకి వెళ్లిపోయితలొక రకంగా

నిర్ణయాలు తీసుకుంటున్నారు.

రోజులు గడుస్తున్నకొద్దీ, యిద్దరిలోనూ ఆవేశం, ఆదుర్దాలు యెక్కువవుతున్నాయి. తమ ప్రయత్నాలు చివరికి ఫలిస్తాయా అనే సందేహం, యిద్దర్నీ పట్టుకుని పీడిస్తోంది. కాని యెవరి ప్రయత్నం, వాళ్లు వదల్లేదు

ఆనాడు సాయంత్రం, లలితాదేవి, చాట ముందరపెట్టుకుని, ఒక్కొక్క మాటే గుణించుకుంటూ, ఒక్కొక్క నల్లరాయిని, ఏరి పారేస్తోంది. కాసేపటి కల్లా బియ్యంలో నల్లరాళ్లు కనిపించలా. అంతా తెల్లగా కనిపించింది. సంతృప్తిగా లేచి, హాయిగా లోపలికి వెళ్లింది. తన మనస్సంతా, ఆనందంతో నిండి పోయింది. తాను అనుకున్న పని, సాధించవచ్చు అనే ధైర్యం ఆమెకు బాగా వచ్చేసింది గబగబ వాకిట్లోకి, సావిట్లోకి, వంటింట్లోకి వెళుతూ వస్తూ, పనులన్నీ చకచక కానిస్తోంది. వీధి తలుపు దగ్గర, యెవరో నిలబడ్డట్లు, మసక మసకగా కనిపిస్తోంది. కళ్లజోడు సరిచేసుకుంటూ, 'ఎవరూ అక్కడ...' చాలా నెమ్మదిగా అన్నది.

'నేనేనండి ... శారదను...' ఆమె కూడా అంతకంటె మెల్లగా అన్నది.

'ఎవరూ... శారదా... ఏమిటమ్మా అక్కడ నిలబడ్డావ్... రా...లోపలికి ...' ఆప్యాయంగా దగ్గరకు వెళ్లింది.

శారద యెంతో సంతోషంగా లోపలికి వచ్చింది ఆమె మొహం విప్పారి వుంది. లలితాదేవి మాటల్లో ఆమె ఊహించలేని, మమకారం, సన్నిహితత్వం, శారదను యిట్టే ఆకట్టేసినాయి.

'ఎంతసేపయిందమ్మా వచ్చి?' ...

'ఇప్పు...ఇప్పుడేనండి...' శారద తడబడింది 'నిలబడే వున్నావు కూర్చో...'

శారదకు, ఊహించలేని బలం, ధైర్యం వచ్చినాయి. అదివరకు లలితాదేవిని చాలాసార్లు కలుసుకుంది. మాట్లాడింది కూడా. కాని యీనాడు ఆమె మాటల్లో తొణికిసలాడుతున్న ఆప్యాయత, మమతలు, శారదను ముగ్ధురాలినిచేసినాయి. ఆమెగారు యింత అవ్యాజమైన ప్రేమ చూపిస్తుందని అనుకోలేదు. తన మనస్సులో ఎన్నెన్నో ఆలోచనలు వెలరేగి, గిలిగింతలు పెట్టేస్తున్నాయి. తబ్బిబ్బులవుతోంది. బహుశా ఆనందరావు, చెప్పేవుంటాడు. ఆమె దానికి ఒప్పుకుని వుంటుంది. అందువలనే, యింత యిదిగా మాట్లాడింది అనుకుంటూ శారద పొంగిపోతోంది.

లలితాదేవి క్షణంలో గిర్రునవచ్చేసి, శారదప్రక్కనే ఓ కుర్చీ లాక్కుని కూర్చుంది. చిరునవ్వు పెదిమలమీదికి రానిచ్చి, 'యివాళ బాగా తీరిగ్గావున్నట్టున్నావ్...' అన్నది.

'అవును ... ఇవ్వాళ ...' హృదయంలో పొంగిపోతున్న ఆనందాన్ని

సంతోషాన్ని ఆపుకోలేకపోయింది, శారద.

'ఏమిటివ్వాళ విశేషం...'

'విశేషం ఏంలేదండీ!... ' పరుగు పరుగున ఆనందరావు దగ్గరకు వెళ్లి 'మీఅమ్మగారు వస్తున్నారు' అని గట్టిగా కేక పెట్టాలనిపించింది. ఆ వేశాన్ని తగ్గించుకుంటూ, అటూ యిటూ తత్తరు చూపులు చూస్తూ, ఆనందరావు ఎప్పుడు వస్తాడా అని ఆరాటపడుతోంది

ఇప్పుడే వస్తానంటూ లోపలికి వెళ్లి క్షణంలో టీ తీసుకొచ్చి యిచ్చింది.

"అప్పే యిప్పుడెందుకు లెండి..." కొంచెం బెట్టుసరి చేద్దామని మొదట్లో అనుకుని కూడా, లలితాదేవి మొహం లోకి చూస్తూ, ఆమెచేతిలోంచి కప్పును అందుకుంది.

కాసేపు, యెవ్వరికీ సంబంధించనివి ప్రమాదం కాని విషయాలు మాట్లాడు కున్నారు. శారద లేవబోతుండగా, 'అప్పుడే వెళుతున్నావా' అన్నది లలితా దేవి.

'మావాడుకూడా లేడు, ఒంటరిగా వుంటానికి ఏమిటో బెరుగ్గా వుంటోంది. మీవాళ్లని అడిగి, యీ రాత్రికి యిక్కడే వుండిపోరాదు...' చాలా సౌమ్యంగా నిదానంగా అన్నది లలితాదేవి.

శారదకు పిడుగుపడ్డట్టయింది కళ్లు గిర్రున తిరిగినాయి. ఒళ్లు తూలింది. మావాడు లేడంటుంది, ఎక్కడికెళ్లాడు. తాను క్రిందటి సాయంత్రమేగా అతన్ని కలుసుకుంది. ఒకవేళ అర్జంటుగా ఊరు వెళ్లాలసివచ్చినా, మాటమాత్ర మన్నా చెప్పకూడదా! ఆశ్చర్యంగా వుందే! అంత మించిపోయిన పని ఏమి ముంచుకొచ్చిందని. శారద పరి పరి విధాల ఆలోచిస్తోంది. ఆమెకు ఆ క్షణాన ఎన్నో ప్రశ్నలు యెదురయినాయి. అయితే అన్నిటిని, ఆమె తనలోనేదాచు కుంది. ఎక్కడికి వెళ్లాడు, ఎప్పుడొ స్తాడు అనే ప్రశ్నలు మాత్రం, గబగబ పరుగెత్తుకుంటూ వచ్చినట్టు వచ్చి, శారద పెదిమలమీద నిలబడ్డాయి. ఉక్కిరిబిక్కిరయింది. లలితాదేవి మొహంలోకి, పేలవంగా, విభ్రాంతంగా, చూసిందే కాని, ఏమీ అడగలేక పోయింది. గుటకలువేస్తూ, 'లేదులెండి నేవస్తా...' అంటూ చర చర వెళ్లి పోయింది, మళ్లీ వెనక్కి కూడా తిరిగి చూడకుండా.

గుమ్మం ముందర నిలబడి, వెళుతూ వున్న శారదవైపుకు, తీవ్రంగా చూస్తూ, తనలోతాను సమాధానపడింది లలితాదేవి.

రెండోరోజే, ఆదరా బాదరాగా, చిరాకుగా, ఆనందరావు వచ్చేశాడు.

"ఎట్లావుంది మామయ్యకు..."

"ఆయనకేమే...దుం..." అన బోయి చప్పున నాలుక కరుచుకుని, బాగానే వున్నాడు అన్నాడు సంపాదిగా.



''అదేం మాటరా, ఒంట్లో బాగాలేదని టెలిగ్రాం వచ్చింది. మరినువ్వేమొ...''

"అదే తమాషా...మావయ్యసంగతి నీకు తెలీదా. చేసేపనులన్నీ యిట్లాగే వుంటాయి. వెళ్లకపోతే నీతోతంటా..."

"అసలు విషయం యేమిటోచెప్పు"

''ఏముంది చెప్పటానికి...ఎట్లావుంది మావయ్యా అని నేనడుగుతే... నాకెట్లా వుంటంయేమిట్రా! నేను ఆరోగ్యంగా వుంటే. చూట్టం నీ కిష్టంలేదా అని పెద్ద పెట్టున అదిరిచచ్చేటట్టు నవ్వాడు. మరి టెలిగ్రాం విషయమో అంటే, నాకేం తెల్సు. నేనివ్వలేదే అనేశాడు. ఇంకా ఆయనతో యేంమాట్లాడాలో నాకే అర్థం కాలా. మతిపోయినట్లయింది..."

"బాగానే వుంది లక్షణం..."

"అస్సరేగాని, మనింటికి నాకోసం యెవరైనా వచ్చారా...'

''ఎవ్వరూరాలేదే...... స్నానం చేసిరా వడ్డిస్తాను..."లలితాదేవి ముందుకు నడిచింది.

ఎడంఅరచేతిని, కుడిచెయ్యి పిడికిలితో గట్టిగా కొట్టుకుంటూ కసిగా, "ఎవ్వరూ రాలేదన్నమాట'' అంటూ తనలోతాను గొణుక్కున్నాడు.

"ఇంతేమిటివిశేషాలు...?" అంటూ

కొడుక్కి అన్నం పెడుతూంది లలితా దేవి.

గబగబ నాలుగు మెతుకులు నోట్లో వేసుకుంటున్నాడు ఆనందరావు. కాని తన మనస్సు, ఆలోచనలు, యిక్కడి నుంచి యెంతో దూరంగా వెళ్ళిపోయి నాయి. లలితాదేవి అడుగుతున్నదాని కల్లా 'ఊ ఊ' అంటున్నాడు అంతే.

ఈ రోజుల్లో ఆడపిల్లల్ని యెవర్ని నమ్మాలో యెవర్ని నమ్మకూడదో తెలీకుండా వచ్చింది. మొన్న శారద యిటువైపుకువస్తే నువ్వుకూడా యింట్లో లేవు. ఒంటరిదాన్ని, యీ రాత్రికి యిక్కడ వుండిపొమ్మంటే, విదిలించేసి నట్లు మాట్లాడింది. నువ్వొట ఆమెతో మాటమాత్రమయినా చెప్పకుండా వెళ్ళి పోయావుట. తెగ గునిసింది. అయినా నాకు తెలీక అడుగుతాను, ఎంత చను వుగావుంటేమాత్రం నువ్వు చెప్పలేదని ఆ సాధింపేమిటి? అయినా నేనేంచేశానని మధ్య. చీటికిమాటికి వస్తోందిగదా అని, చనువుగా యిక్కడ వుండమన్నా, దాని కన్నమాటయిష్టంవచ్చినట్లుమాట్లాడటం. అయినా నాదే తప్పు. ఆ అమ్మాయిని అంటం యెందుకు..."

క్షణం మెదలకుండా వూరుకుని 'ఏమందేమిటి' అంటూ గట్టిగా అరిచాడు.

"ఇప్పుడు అవన్నీచెప్పి నీ మనస్సు పాడుచెయ్యక్కర్లేదు గాని ... అంటే అంది. నాకు లేని రోషం నీకెందుకు...' లలితాదేవితొణక్కుండానదురూ బెదురూ లేకుండా అనేసింది. ఆనందరావు స్తబ్దుడయిపోయాడు. కొడుక్కి తన మాటంటే మంచిగౌరవము, విలువాయిస్తా డని లలితాదేవికి తెలుసు. ఆవిశ్వాసాన్నే పూర్తిగా ఉపయోగించుకుంది.

రెండు మూడు రోజులయినా కూడా ఎడమొహం పెడమొహంగానే వుండి పోయారు శారద ఆనందరావులు. ఒక ర్నొకరు చూసుకున్నారు. కాని తల వంచుకుని యెవరిదోవన వాళ్ళు వెళ్ళి పోతున్నారు.

చెప్పకుండా హఠాత్తుగా ఊరువెళ్ళి నందుకు, పశ్చాత్తాపపడుతూ ఏమయినా అంటాడేమోనని, శారద యెదురు చూసింది. తానులేని సమయంలో, తన తల్లిని ఆడిపోసుకున్నందుకు క్షమాపణ చెపుతుందేమోనని ఆనందరావు ఎదురు చూశాడు. కాని యిద్దరూ కూడా నిస్పృహ చెందారు. ఆనందరావు పలక రిస్తేనే తాను మాట్లాడదామని శారద, శారద ముందు మాట్లాడితే తాను పలక రించాలని ఆనందరావు పట్టుదలతో వున్నట్టుగా యిద్దరూముభావంగానే వుండి పోయారు. శారద ఒళ్ళుమండిపోతోంది ఆనందరావుకు అహంకారం హెచ్చి పోతోంది.

శారద ఉండబట్టలేక ఓనాడు ఆనంద రావు యింటికి వచ్చేసింది. ఆ సమయాన అతను యింట్లో లేడు. ఆ వేళప్పుడు

సాధారణంగా యింట్లో వుండాల్సిందే మరి, కాని లేదు. ఆమె కళ్లు అటు యిటూ గిర్రున తిరిగినాయి. పెదిమ విరిచింది. లలితాదేవి భాగవతంచదువుతూ కూర్చుంది. శారదను చూడంగానే పుస్తకాన్ని మూసేసి కళ్లజోడు తీసి దగ్గరకు వచ్చి, 'రా అమ్మాయి కూర్చో' సమయానికే వచ్చావ్ అన్నది.

శారద తత్తరపడింది. సమయానికే వచ్చావ్ అంటోంది. ఏం సమయం అనుకుంటూ 'ఏమిటండీ' అన్నది.

ఏంచెప్పమంటావ్ అమ్మా ...... ఎప్పుడైనావస్తే,నువ్వొస్తావు మాయింటికి ఇంకెవరొస్తారు. ఎవరితో చెప్పుకోను. ఏదైనా మనసులో బాధ కలిగినప్పుడు యింకొకళ్ళతో చెప్పుకుంటే తగ్గుతుందంటారు. అందులో నీతో చెపితే, నా మనస్సు తేలిగ్గా, హాయిగా వుంటుంది కూడా. ఏమని చెప్పమంటావ్. మావాడి తీరు ఏమీ బాగాలేదు. మొన్నీమధ్య, మేనమామగారి యింటికి వెళ్ళినప్పటి నుంచి వాడదోరకంగా వుంటున్నాడు. వాడు చెప్పినదానికి, దేనికీకూడా నేను యింతవరకు అడ్డంరాలేదు. అడ్డంరాను కూడా. అవ్వటం మా అన్నయ్య కూతురే కాని సుతరాం నాకిష్టంలేదు. మావాడికి ఆ కళ్యాణినే పెళ్ళిచేసుకోవాలని వుంది. పోనీ ఆ మాట నాతో చెప్పచ్చుగా, చెప్పలేదు. ఏదో చిరాకుపడతాడు. విసుక్కుంటాడు. పైకి ఒక్కమాట అనడు. తీరా మా అన్నయ్య ఉత్తరం రాసేదాక, నాకీ విషయం తెలియనే తెలియదు. వాడు సుఖంగా వుంటం నాక్కావల్సింది. అంతకంటేనేను కోరుకునేదేముంది. కళ్యాణినే చేసుకుంటానని నాతో ఓమాట అనచ్చుగా, నే కాదంటానా ......' లలితాదేవి యింకా చెప్పబోతుంటే, శారద రెండు చేతుల్తోనూ రెండు చెవులు గట్టిగా మూసుకుని, గిర్రున వెళ్ళిపోయింది.

'శారదా, శారదా' అంటూ గట్టిగా రెండుసార్లు పిలిచింది లలితాదేవి వినిపించుకోకుండానే సాగిపోయింది.

ఆనందరావు చిర్రు బుస్సులాడుతూ రాత్రి తొమ్మిదిగంటలవేళ యింటికి వచ్చాడు. తానేదోనాటకం ఆడాలని అనుకొంటే అసలుకే మోసంవచ్చిందే! శారద ప్రవర్తన ఏమీ బాగాలేదు. ఇంతయిదిగా మారిపోతుందని అనుకోలేదు. అంత ధీమా, గర్వం, అహం, ఆడదానికి పనికిరాదు. పైకి చూట్టానికి సాత్వికంగా కనిపించినా. శారదచాలా చాలా తామసంగా కనిపిస్తోంది. ఏమో అనుకున్నా, తనలో తాను గుణించుకుంటూ కూర్చున్నాడు గదిలో.

తల్లి మెల్లిగావచ్చి, గది ముందర నిలబడింది. ఆమెనుచూసి చివాలునలేచి, అన్నంపెట్టు వస్తున్నా అన్నాడు. ఆమె మెదలకుండా వంటింట్లోకివెళ్ళిపోయింది.

''ఏరా అబ్బాయి అట్లావున్నావే...

ఒంట్లో సరిగ్గా లేదా యేమిటి......"
వడ్డిస్తూ లలితాదేవి మెల్లిగా అన్నది.

ఆనందరావు యేమీ మాట్లాడలేదు

మళ్ళీ రెండోసారిఅడిగింది: అప్పటికీ యేమీమాట్లాడ లేదు. చనువుగా కాస్తంత దగ్గరకు వచ్చి, "ఒరేయ్‌అబ్బాయినిన్ను ఎన్నాళ్లబట్టో ఓ మాట అడుగుదా మను కుంటున్నాను ... మరి ..." అంటూ మధ్యలో ఆపేసింది.

ఆనందరావు ఆసక్తిగా ఏమిటామాట అంటూ తల్లివంక చూశాడు. అతని మొహంలో మార్పును గమనించి, ఆమె చెప్పటానికి ఉత్సాహపడింది.

"మరేంలేదుగాని," అంటూ ప్రారంభించింది.

"నీ పెళ్ళిమాట ఎప్పుడెత్తినా విసుక్కుంటూ మాట్లాడతావు. అందుకనే నాకు భయంగా వుంది నీతోమాట్లాడటం.

"విసుగు ఎవరిమీదమ్మా, ఊహించుకున్నవన్నీ జరుగుతాయా, జరక్కపోతే విసుగురావటం సహజం. అయినా జరగనివి ఊహించుకోవటం ఎందుకు..." ఆలోచనగా అన్నాడు.

"ఏమటో నీ మాటలు అర్థంకావటం లేదు...అయినా నే చెపుదామనుకుందే మంటే...శారద వుంది చూడు. ఆ అమ్మాయిని చూసినప్పటినుంచీ, నా కోడలు అవుతే యెంత బాగుంటుందని ఎంతో మురిసిపోయాను. అయినా నే నొక్కదాన్ని అనుకుంటే యేమిటి ప్రయోజనం... మొన్న వచ్చినప్పుడు అంతా చెప్పేసింది వాళ్ళ నాన్నవాళ్లు ఆ అమ్మాయికి పెద్ద సంబంధం ఒకటి నిశ్చయం చేశారట. అది నీతో ఎట్లా గోట్లా చెప్పాలని ఆవేదనపడింది. తానంతట తాను నీదగ్గరకొచ్చి చెప్పటానికే బిడియపడుతోంది. ఇహ నేనున్నాగా, నన్ను చెప్పమంటూ కూర్చుంది......"
ఆనందరావు మొహంలోకిచూస్తూ, లలితాదేవి చప్పున ఆపేసింది.

"ఏమిట్రా అబ్బాయి..." అంటూ వీపుతట్టి మరో కేకవేసింది...

"ఊహు యిదాసంగతి" అనుకుంటూ పెద్ద నిట్టూర్పుతో చివాలున లేచాడు.

"అబ్బాయి..." అంటూ గట్టిగా పిలిచింది.

"అమ్మా...నా పెళ్ళి చూడాలనిగదా- నీ కోరిక, వెంటనే ఆ కామాక్షమ్మగారికి కబురుపెట్టు. నేను సరళను చేసుకుంటానని చెప్పేసెయ్యి. వెంటనే ముహూర్తం పెట్టించు..."గబగబ అనేశాడు. ఒక్క అంగలో బైటకు నడిచాడు.

లలితాదేవి హృదయంమీద రెండు చేతులూ సంతృప్తిగా పెట్టుకుని, యీనాటికి నా కోరిక తీరుతోంది, అంటూ సంతోషంగా పెద్దగా నిట్టూర్చింది. ఇప్పుడేంచెయ్యాలా అనే ఆలోచనల్లో, శారద వచ్చి నిలబడ్డట్టు కూడా గమనించనేలేదు.

ఇట్టే తలపైకెత్తగానే 'శారద'

కనబడింది చప్పున త్రుళ్ళిపడింది. గుండె దడ యెక్కువయింది. ముచ్చె మట్లుపోసినాయి. ఇందాకటి సంభాష ణంతా విన్నదేమోనని తెగ భయపడి పోయింది. శారద వాలకం అట్టె చూస్తుంటే, ఆమె అప్పుడే వచ్చిందని ఊహించుకుంది. దానికి తగ్గట్టుగానే ఆమె మాటలు కూడా అతికిపోయి నాయి.

"మీరు మొన్న చెప్పినవన్నీ నిజ మేనా అనే అనుమానం కలిగివచ్చానండి ..." అన్నది నవ్వుతూ శారద.

"ఆ!......" అంటూ క్షణం కంగారుపడి మళ్ళీ తమాయించుకుంది లలితాదేవి. నిబ్బరంగా ఆలోచిస్తూ "మొదట్లో నేను కూడా నమ్మని మాట నిజమే...కాని ... నేనెవ్వరితో చెప్పు కోను. ఎవ్వరితో చెప్పుకుంటేనాఆవేదన తీరుతుందో అర్థంకావటంలేదు. నువ్వు చిన్నపిల్లవి. నీతో చెప్పటం కూడా మంచిదికాదని అనుకుంటూనే చెపు తున్నాను. నువ్వేమీ అనుకోవద్దు. మా వాడి పద్ధతి యేమీ బాగాలేదు. రాత్రి తూలుతూ యింటికివచ్చాడు శారద. హడలిచచ్చాను, ఏమిటా యీ కర్మని. తాగుడుఅలవాటుచేసుకున్నాడమ్మా..." గద్గదంగా అంటూ కళ్ళనీళ్ళుపెట్టుకుంది లలితాదేవి.

శారద స్తబ్ధురాలయిపోయింది. ఆశ్చర్యంగా క్షణం చూస్తూ వుండి పోయింది. ఏమి మాట్లాడాలో తోచలేదు. తానెంతో భవిష్యత్తుమీద ఆశ పెట్టుకుని, ఆనందరావుమీద ఆశలుపెంచుకుని, తన యింట్లోవాళ్ళందరికీ ఎంతెంత గానో చెప్పిన శారదకు, యీనాడుమళ్ళీ తానే, ఆనందరావును గురించి యింకో విధంగా చెప్పాలంటే తనకు చేతకాదు. తన తల్లితండ్రులు, తనమీద ఉంచిన విశ్వాసాన్నంతా యిట్టే తీసేసుకుంటారు. తాను ఏ విషయం చెప్పినా యిహ నమ్మరు. తన మొహం వాళ్ళకు యెట్లా చూపించేటట్లు, అనుకుంటూ పరిపరి విధాల ఆలోచించుకుంటోంది. శారదకు ఎటూ తోచటంలేదు. ఆనందరావుతోనే ముఖాముఖిగా మాట్లాడాలనుకుంటుంది. "ఛీ" యింకా ఆయనతో మాట్లాడటమా! ఏ మొహం పెట్టుకుని అనుకుంటూ తనతో తాను తీరనివ్యధపడుతోంది.

'వస్తానండి...' అంటూ యెంతో బరువుగా వెనక్కు తిరిగి, శారద వెళ్ళి పోయింది.

ఆనాడు యింట్లోకివస్తూనే అన్నాడు ఆనందరావు "ఏమిటి కామక్షమ్మగార్కి కబురు పంపించావా" అని.

"నీకన్నీ తొందరేరా, అనుకున్న మరుక్షణం జరిగిపోవాలంటావ్ ..." ఎంతో తేలిగ్గా అనేసింది లలితాదేవి.

హఠాత్తుగా శారద గబగబ తనింటి వైపుకే రావటంచూసి, లలితాదేవి తెగ కంగారుపడింది. కిటికీలోంచి చూసిన

ఆనందరావు పళ్లు పటపట మన్నాయి శారద హుంకరిస్తూ, ఎంతో రోషంగా వచ్చి నిలబడింది గుమ్మంముందర.

"ఏవండీ! ......" కొంచెం గట్టిగా పిలిచింది.

"ఎవరూ..." అనుకుంటూ లలితా దేవి, గుమ్మం దగ్గరకు వచ్చేస్తింది.

మీ అబ్బాయి కిచ్చేసెయ్యండి ... మళ్ళీ మీ గుమ్మం తొక్కను ... ఇదే చివ్వరిసారి యిక్కడికి రావటం..." అంటూ ఓ ఫోటోను, అతినిర్లక్ష్యంగా లోపలికి గిరాటు పెట్టి గిర్రున తిరిగి వెళ్ళిపోయింది.

"అమ్మాయి శారదా..." ఎంతో ఆప్యాయంగా పిలిచింది. ఆనందరావుకు అహం కూడా దెబ్బతిన్నది.

"అమ్మా!..." అంటూ బిగ్గరగా కేక పెట్టాడు, గదిలోంచి చివాలునవచ్చేసి. శారదకు ఆ శబ్దం వినిపించి కూడా లెక్కలేకుండా, అతిధీమగా ముందుకు సాగిపోయింది.

ఈనాటితో పూర్తిగా రక్తి కట్టి పోయిందని లలితాదేవి బాగా సంతోషించింది. ఇహ తన ప్రయత్నాలకు యే విధమైన ఆటంకంరాదనిబాగా సంతృప్తి పడింది.

కామాక్షమ్మకు కబురుచెయ్యటం ఆలస్యంగా, ఆమెగారు కూతరితోసహా వచ్చివాలింది.

ఆనందరావు తుమతుమలాడుతూ, సరళవంక చూశాడు. ఆమె అంతకంటే చిరుబుస్సులాడుతూ ఆనందరావువంక చూసింది ఈడూ జోడూ బాగుంది అనుకున్నారు, కామాక్షమ్మ, లలితాదేవి యిద్దరూను. శారద తల్లి తండ్రులిద్దరికీ కూడా యీ సరళ రావటం యిక్కడ హడావిడీ అంతా తెలిసిపోయింది. శారదను వత్తి వత్తి అడుగుతున్నారు "ఏమిటమ్మా విషయం, నువ్వేమో ఆనందరావు సంగతి చెపుతూవుంటావు. అక్కడ వాళ్ళింట్లోనేమో సరళవిషయం అనుకుంటున్నారట" అన్నాడు ముక్త సరిగా శారద తండ్రి.

శారద కాసేపు తటపటాయించినా ఏదో సమాధానం చెప్పాలనే ఆరాట పడుతోంది.

"గిట్టనివాళ్ళు ఏదోచెపుతారునాన్నా? అవన్నీ మనకెందుకు......" అంటూ యెంతో నిబ్బరంగానూ, హుందాగానూ అన్నది శారద.

అన్నదే గాని మాట, ముందు యేం చెయ్యాలో తోచటంలేదు. తికమకపడి పోతోంది

"అవన్నీ మనకెందుకంటే యెట్లాగు, అన్నీ ఆలోచించుకునే చెయ్యాలమ్మా .." ఇంకా ఆయన ఆదుర్దాగా అంటున్నాడు.

"నే చెప్పిన మాటలు నమ్మకపోతే, నువ్వే ఆయనకే రాసి కనుక్కోనాన్నా ..." చప్పున నాలుక కరుచుకుంది శారద.



"ఊఁ..." అంటూ శారద తండ్రి ఆలోచనగానే చూశాడు.

ఆనందరావు ఆనాడు యింటికి వస్తూనే అదో తమాషాగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. లలితాదేవికి గుండె అదురుగా వుంది. క్షణ క్షణానికి భయపడిపోతోంది. ఇంతలో యింత మార్పు రావటానికి కారణం యేమిటా అని తపనపడిపోతోంది. ఏ మాట చెప్పినా చప్పున వ్యతిరేకంగా సమాధానం చెపుతున్నాడు. అదోరకంగా మాట్లాడుతున్నాడు. లలితాదేవికి యేమీ అర్థంకావటంలేదు. కామాక్షమ్మకవుతే మతిపోయినట్టే అయింది. సరళ బిత్తరు చూపులు చూస్తోంది. ఏమి ముంచుకొస్తుందో అని లలితాదేవి లోపల లోపల

తెగ ఆరాటపడుతోంది. ఆందోళనపడు తోంది. ఎవరితోనూ చెప్పేటట్లు లేదు. సాహసించి హఠాత్తుగా కొడుకు పెళ్ళి సరళతో నిశ్చయించేటట్లులేదు. తనతల్లి సతమత మవుతున్నట్లు ఆనందరావు కూడా పూర్తిగా గ్రహించాడు.

ఆనాడు సాయంత్రం ఆరుగంటలకు లలితాదేవి ఒక్కతేవరండాలో కుర్చీలో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తోంది. యింకా కామాక్షి సరళా యింటికి రాలే దేమిటా అని. తన కొడుకు కూడా యివ్వాళ పెందరాళే వస్తానన్నవాడు యెందుకు రాలేదా అని యేవేమిటో ఊహించుకుంటోంది.

మసకమసకగా చీకటి అలుముకు పోతోంది. ఆకాశంలో నక్షత్రాలు మిణుకు మిణుకు మంటున్నాయి. పైకి చూసింది. ఇంతలో ఓ బండి వస్తున్నట్లు చప్పుడయింది. ఆ అలికిడి బాగా దగ్గర గానే వినిపించింది. తీరా వచ్చి వచ్చి ఆ బండి సరిగ్గా లలితాదేవి గుమ్మందగ్గర ఆగిపోయింది. ఆమె లేచి విడ్డూరంగా చూస్తోంది. బండిలోంచి యిద్దరు దిగారు. ఇద్దరూకూడా యీమెవైపుకేవస్తున్నారు.

అమాంతం, ఆ యిద్దరూ, లలితా దేవి పాదాలమీదకు వంగి 'ఆశీర్వ దించమ్మా. చివ్వరికి నీ కోరికే నెర వేరింది ...' అన్నాడు ఆనందరావు.

"ఆ..." అనుకుంది.

"శారద తండ్రి నాకు చెప్పాడు విషయమంతా..." అని యింకాయేదో అనబోతుంటే శారద కూడా చిరునవ్వు మొహంతో లలితాదేవివంక చూసింది.

"అబ్బాయి! నేనింకా యెందుకు బతికివున్నాననుకుంటున్నావ్ ... ..." ఎంతో హుందాగానూ గంభీరంగాను అన్నది లలితాదేవి.

"అబ్బాయిగారి పెళ్ళిచూట్టానికేగా..." నూతన దంపతులిద్దరూ మెల్లిగా లోపల లోపల నవ్వుకున్నారు.

---

పిచ్చాసుపత్రిలో ఉన్మాదంలో ఉన్న ఒకరోగిని డాక్టరు కల్సు కున్నాడు.

"ఏమిటి అసలు విషయం?"

"డాక్టర్, నేను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను"

"నీ వయస్సెంత?"

"ఏభై ఏడు"

"అంటే యాభైసంవత్సరాల వయసున్న భార్య కావాలన్నమాట!"

"డాక్టర్! ఇరవైఅయిదు సంవత్సరాల వయస్సుగల ఇద్దరు భార్యలైనా చాలు!"